# తీయ మామిడి చెట్టు


మ. సత్యభారతి

కొన్ని వందల సంవత్సరాల క్రితం కాశీనగరంలో బసవరాజు అనే ధనవంతుడు ఉండేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వారికి ఆనందుడు, పరమానందుడు, సదానందుడు, చిదానందుడు అని పేర్లు పెట్టాడు. వీరంతా పెరిగి పెద్ద వాళ్లయే సరికి బసవరాజు కోటికి పడగలెత్తాడు. అతంతా పుత్రుల అదృష్టమని తండ్రి మురిసిపోతూండే వాడు. కాని, నలుగురు కొడుకులూ సకల విద్యలూ సమగ్రంగా చదువుకోవటంవల్ల వారికి వైరాగ్యం పెరిగింది. జీవితం గాలిబుడగ వంటిదనీ, శరీరం క్షణభంగురమనీ [illegible] గురు కొడుకులూ తండ్రితోడట వేదాంతం చెబుతూండేవారు.



వీరి వేదాంతం వింటూంటే తండ్రికి విసుగు పుట్టేది. నలుగుర్నీ నాలుగు వృత్తులలోనూ ప్రవేశపెట్టినట్లయితే ఒకదారికి వస్తారని ఆలోచించి బసవరాజు తన పెద్ద కుమారుడైన ఆనందుణ్ణి పొలంపనిలోను, పరమానందుణ్ణి వర్తకంలోను, సదానందుణ్ణి పైఊళ్ళ సంతల బేరాలలోను, చిదానందుణ్ణి గృహనిర్వాహణలోను ప్రవేశపెట్టాడు. ఒకఏడాది గడవకముందే వారు తండ్రి ధనాగారానికి దెబ్బతీశారు. పొలంమీద పంటను కర్ణుడిలా పంచాడు ఆనందుడు—"ఏం శాశ్వతం?" అనే తత్వంతో.

సంతల బేరాలలో సరకు ధరకు మించిన ధనంఇచ్చి నష్టపోతూండేవాడు సదానందుడు. వర్తకంలో చెయ్యిపెట్టిన పరమానందుడికి బేరగాండ్లకు తేరగా సరకులివ్వటం సరదా అయింది. ఇంక చిదానందుడు రోజుకి ఇరవైమంది సన్యాసులకు ఆతిథ్యం ఇస్తేగాని నిద్రపోయేవాడు కాదు. నిలవ వెయ్యాలనే తండ్రిబుద్ధికీ, వ్యయం చెయ్యాలనే కొడుకుల బుద్ధికీ తూకం సరిపోయింది. ఒక్క ఏడాదికే తండ్రి తన కొడుకులంతా తనకు పనికిరాని సుపుత్రులని గ్రహించి "మీ కేం పనిపాటు లేకుండా, ముక్కుమూసుకుని ఇంట్లో కూచోండి... మీకు



తల్లి ప్రేమ

## ★ తీయమామిడి చెట్టు ★

వంలోటు రాదు" అని ఆజ్ఞాపించాడు.

"మేం ముక్కు మూసుకు నేకూ చోదలచుకున్నాం. ఐతే ఇంట్లో కాదు...హిమాలయా పర్వతాలదగ్గర" అని నలుగురు కొడుకులూ జవాబిచ్చేసరికి బసవరాజుకి మతిపోయింది.

"సిరి ఉండనీ, సంపదతోబాటు సంతానం ఉండనీ సంతోషిస్తున్న నాకు ఎటువంటి కొడుకులు పుట్టార్రా! కూడబలుక్కుని కట్టకట్టుకుని బైరాగులవాలని మొందుకు బుద్ధి పుట్టిందిరా మీకు?" అని తండ్రి ప్రశ్నించాడు.


"సర్వం మిథ్య నాన్నగారూ! మీరు మిథ్య, మేము మిథ్య-అస్మి మిథ్య, ఐశ్వర్యం మిథ్య అనే జీవిత సారం కనుక్కున్నాం" అన్నాడు పెద్దవాడు ఆనందంగా.

"గంగలో దిగండి...ఈ గంగ వెర్రులు తగ్గుతాయి" అన్నాడు తండ్రి కోపంతో.

"ఐతే మాకు అనుజ్ఞ ఇవ్వండి" అన్నారు కొడుకులు.

ఆనందస్వరూపులు నలుగురూ ఒక శుభముహూర్తాన హిమాలయా పర్వతశ్రేణి పాదాలదగ్గరకు బయలుదేరారు. దండ కమండల కాషాయాది అలంకారాలతో భగవద్ధ్యానం చేస్తూ ఊరిలోని వారందరివద్ద సెలవు పుచ్చుకున్నారు ఈ వేదాంతులు.

నెలరోజులకు వారు తమ గమ్యస్థానం చేరుకున్నారు. ఈశ్వర ధ్యానం చేయటానికి మైలుదూరాని కొకటిలాగున గుడిసెలు వేసుకుని, నాలుగు కుటీరాల్లోనూ నలుగురూ జపం చేయటం ప్రారంభించారు. నెలలుగడిచినవి. ఆనందుడు తపోనిష్ఠ



పిల్ల ప్రేమ

ఫొటోలు: మలిశెట్టి సూర్యనారాయణరావు—కాకినాడ.

నుంచి మేల్కొనేసరికి ఆంజనేయుడు అవతరించాడు.

"నీ తమ్ముళ్ళని ఓసారి చూసిరా ఆనందస్వామీ! ఈ సంచి దగ్గర పెట్టుకో" అని ఆంజనేయుడు తన భక్తుడికి ఒక సంచీనిచ్చి అంతర్ధానమయాడు.

సంచీని భుజాన వేసుకుని ఆనందుడు మైలుదూరంలో ఉన్న పరమానందుడి కుటీరం చేరుకున్నాడు.

"అన్నా! ఆనందా! ఇక్కడ ఈ చలిలో తపస్సు చేయలేక పోతున్నాను...అగ్ని దొరికే ఉపాయం ఉంటే చెప్పు" అన్నాడు పరమానందుడు.

ఆనందుడు వరప్రసాదంగా లభించిన సంచీవైపు దృష్టిని సారించగానే అందులోనుంచి చిన్న గొడ్డలి పైకి వచ్చింది. క్షణంసేపు అతడు స్మరించి,

"పరమానందా! ఈ గొడ్డలి దగ్గర ఉంచు...నీకెప్పుడు వేడి కావాలంటే అప్పుడీ గొడ్డల్ని అడుగు. కట్టెలుకొట్టి, కణకణలాడే అగ్నిని పుట్టిస్తుంది" అని అన్నాడు ఆనందుడు.

పరమానందుడు అమితానందం పొంది దైవదర్శనం కనుచూపు మేరలోనే ఉందని భావించాడు.

ఆనందుడు మరొక మైలుదూరం నడిచి సదానందుడి ఆశ్రమం చేరుకొని కుశలప్రశ్నలు వేశాడు.

"ఆనందా! ఇక్కడ పశువుల బాధ ఎక్కువగా ఉంది. అవి ఘీంకారం చేసేసరికి మనస్సు చెదిరి తపస్సు చెడిపోతోంది." అన్నాడు సదానందుడు.

ఆనందుడు మళ్లీ వరప్రసాదియైన సంచీని చూడగానే అందులోనుంచి మద్దెల పైటకు వచ్చింది. క్షణకాలం మారుతిని స్మరించి:

# ★ తియ్యమామిడి చెట్టు ★

"సదానందా! ఈమద్దెలను కుడివైపు కొడితే ఏనుగులు బెదురుతాయి. ఎడంవైపు కొడితే మందలకొద్దీ వచ్చి నీకు దాసోహం చెప్తాయి" అని చెప్పాడు.

సదానందుడు చాల సంబరపడ్డాడు. అక్కడనుంచి ఆనందుడు మరొకమైలు నడిచి, చిన్నతమ్ముడైన చిదానందుడి కుటీరం చేరుకుని అతని యోగక్షేమాలు అడిగాడు.

"పెద్దన్నా! పెరుగు అన్నం లేనిదే ఎంత గింజుకున్నా దేవుడిమీదకు దృష్టి పోవటంలేదు. మన ఇంటిదగ్గర కడుపునిండా తినిన మీదట వేదాంతం కలుగుతుండేది" అన్నాడు చిదానందుడు.

చిన్నవాని చిలిపితలపులు ఆనందుడికి నవ్వు కలిగించాయి. మరొకసారి అతడు సంచీవైపు దృష్టి సారించాడు. అందులోంచి ఒకరజతపాత్ర బైటకు రాగానే అతడు క్షణకాలం మారుతిని ప్రార్థించి ఇలా అన్నాడు:

"చిదానందా! నీకీగిన్నె ఎంతో సేవచేస్తుంది. కావాలన్నప్పుడల్లా నీకు పెరుగు, పాలు తెస్తుంది. అంతేకాదు నీకు కోరికైతే నీయెదట దధిసాగరాన్నే ఏర్పరుస్తుంది. పొట్టపూజనుంచి క్రమక్రమంగా దైవపూజవైపు, మనసు లగ్నంచేయి" అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు ఆనందుడు హిమాలయాశిఖరాలకు.

"నా తమ్ముళ్ళింకా జితేంద్రియులు కాలేదు. ఏ ఇక్కట్లూ వారికి రాకుండా కాపాడాలి మారుతీ!" అని ధ్యానిస్తూ ఆనందుడు తపోనిష్ఠలో పడ్డాడు.

## 2

నలుగురు కొడుకులూ ఇల్లువదిలి వెళ్ళిన తరువాత బసవరాజుకి ఏమీతోచేది కాదు. కోటికి పడగలెత్తినప్పటికీ అతడికి ఇంట్లో ఆనందం లేదు. పిచ్చివాళ్ళయినప్పటికీ కొడుకులు ఇల్లువదలగానే బసవరాజుకి పుత్రులపై ప్రేమ పెరుగుతూ వచ్చింది. ఎందుకు వాళ్ళని దూరం చేసుకున్నానా అని అతడు దిగులు చెందుతూ వచ్చాడు. అంతేకాదు వాళ్ళని సరియైన మార్గంలోకి తీసుకురాలేకపోయినందుకు తనను తానే తిట్టుకొన్నాడు బసవరాజు. పిల్లల తల్లి ఉండి ఉంటే వాళ్ళకీ వైరాగ్యం వచ్చిఉండేది కాదని అతడు అనుకొన్నాడు.

ఇంట్లో ఇల్లాలు లేకపోవడంవల్ల కలకల్లాడే పిల్లలు లేకపోవడంవల్ల బసవరాజుకి కూడా బైరాగిగా మారదామనే ఆలోచన తట్టేదే కాని డబ్బుకీ, ఇనప్పెట్టికీ తన ప్రాణానికి లంకె ఎక్కువగా ఉన్నందువల్ల అతడు ఈబాధల్ని దూరంగా త్రోసివేశేవాడు.

వృద్ధాప్యం రావడంవల్ల బసవరాజు ఒక నిశ్చయానికి వచ్చాడు. కాళీనగరాన్ని గాలించి తనజాతిలోని బీదవాణ్ణి ఎన్నుకొని దత్తత చేసుకున్నాడు. అతడిపేరు ధనంజయుడు. అతనివయస్సు ఇరవైసంవత్సరాలు. అతడు బసవరాజుకి నచ్చిన కొడుకుగా ఏగానికికూడా మాటలు కట్టే రకంగా కనుపించాడు. పెంచుకున్న కొడుకు



ప్రయోజకుడనే సంతృప్తితో బసవరాజు శాశ్వతంగా కన్నుమూశాడు.

ధనంజయుడికి కోటిరూపాయల ఆస్తి చేజిక్కింది. అసలు రంగుబైట పడింది. నడమంత్రపు సిరి అతడికి గిలిగింతలు పెట్టింది. చిన్ననాటి నుంచి ఈడేరని కోరిక లన్నిటినీ తీర్చుకోవటమే అతనిపని అయింది. కాశీలో కనుపించిన భోగాలన్నిటినీ అనుభవించాడు. దేశదేశాలు తిరిగి వింతలూ విశేషాలు చూద్దామని లక్షరూపాయలు బొడ్డున కట్టుకుని ప్రయాణం చేయదలచాడు. ఓడల రేవుకువచ్చి తూర్పుగా బయలుదేరే ఓడ ఎక్కాడు.

ఓడ నడిసముద్రంలోకి వచ్చింది. ఎటుచూసినా నీరేగాని నేల కనుపించటం లేదు. కెరటాలలో ఊగుతున్న ఓడలో కులుకుతూ కలలుగంటున్నాడు ధనంజయుడు. వెన్నెలవెలుగులో సాగరుడు సుందరంగా ఉన్నాడు. చీకటి రాత్రుళ్ళలో చుక్కల సొగసు వర్ణనాతీతంగా ఉంది. ఓడ ప్రయాణం చేస్తూనేఉంది. ఒకనాటి అర్ధరాత్రి ఆకాశంలోని చంద్రుడు, నక్షత్రాలు అంతర్ధానమై మబ్బులమయమైంది. గాలి పెనుగాలి అయింది. ఓడ ఉయ్యాలలా ఊగి, కెరటాల తాకిడికి తట్టుకోలేక చిల్లులుపడి బుడుంగున మునిగింది.

ధనంజయుడు మాత్రం మృత్యుంజయుడయాడు. కొయ్యముక్క ఊతతో అతడు కొనఊపిరితో సుమిత్రాదీవిని చేరుకున్నాడు. భూదేవి కనుపించగానే అతనికి కొంతో ధైర్యంవచ్చింది. తెల్లవారేవరకు ఒడ్డున కూచున్నాడు. సూర్యోదయమైంది. సుమిత్రాదీవి సందర్శనం అయింది. కాని, ఆదీవిపై కంటికి కనుపించే మేరలో పిట్టగాని, మనిషిగాని లేడు. సమతల ప్రదేశంలో దూరాన ఒకే ఒక చెట్టు కనుపించింది.

ఆకలితో అటమటిస్తున్న ధనంజయుడికి ఆచెట్టును చూడగానే ఆశలు పెరిగాయి. దాని దగ్గరకు కష్టంమీద నడచి వెళ్ళాడు. దానిని సమీపిస్తున్నకొలదీ అతనిలో సంతోషం పెరుగుతూ వచ్చింది. చేతులుజాపి తనను ఆహ్వానిస్తున్నట్లుగా ఉన్న పెద్దపెద్ద కొమ్మలు చూశాడు. అదొక పెద్ద మామిడి చెట్టు. చేతికి అందుతున్నాయి పండ్లు. ఒకటికోసి నోట కరిచాడు. అమృతమంతటి రుచి కలిగి ఉన్నాయి. గబగబా రెండుపళ్లు కోసి జుర్రుమంటూ తిన్నాడు. కడుపు నింపుకున్నాడు. కంటికి కునుకు వచ్చింది. చెట్టెక్కి పలవలమీద పడుకున్నాడు. కంటినిండా నిద్ర పట్టింది.

కొంతసేపటికి అతడు కన్ను తెరచాడు. చెట్టుకింద అడవిపంది నిద్రిస్తూ ఉంది. అతడికి భయం వేసింది. కాని, ఆ పందినోట్లో ఏదో ధగధగ మెరుస్తోంది. దానిని చూస్తే కండ్లు కుట్టాయి. మెల్లగా చెట్టుదిగి, ధైర్యంతో పందిదగ్గరకు వచ్చాడు. దానినోట్లో ఉన్నది ఒక వజ్రం. భలేబాగుంది అనుకుని, దానిని ఎలాగైనా తీసుకోవాలని అతనికి ఆశ పుట్టింది. చెట్టుక్రింద తేరిపార చూశాడు. గట్టికర్ర ఒకటి కనుపించింది. దానితో పంది నెత్తిమీద బలంగా కొట్టేడు. అది ప్రాణాలు విడిచింది. వజ్రం ధనంజయుడి చేచిక్కింది.

"ఆహా! ఎంతబాగుందీ వజ్రం.. చెట్టుమీద కూర్చుని సావకాశంగా చూద్దాం" అని అతడు అనుకున్నాడో లేదో రెక్కలువచ్చి ఎగిరినట్టుగా ఒక్కత్రుటిలో చెట్టుమీదకు ఎక్కాడు. అపరిమితమైన ఆశ్చర్యం కలిగింది అతనికి. ఈవ్రజంలోఉండే మహత్తు అతనికి తెలిసింది. ఈ అడవిపంది కూడా ఇలాగే ఏదేశంనుంచో ఇక్కడకు వచ్చి ఉంటుందని అనుకున్నాడు. ఇది ఎక్కణ్ణుంచి వచ్చిందో అక్కడికి వెడితే ఇంకా కొన్ని వజ్రాలు దొరుకుతాయి కదా అని అతడు అనుకుంటూ ఉండగానే కూచున్నవాడల్లా కుబేర పుష్పకంలో ప్రయాణం చేస్తున్నట్టు ఆకాశమార్గాన రయ్యిమని వెళ్లుతున్నాడు. కిందకుచూస్తే నదులు, పట్టణాలు, పురుగుల్లా ప్రజలు అతనికి కనిపించారు. ఆగి, వింతలు చూద్దామన్నా అతను ఆగలేక పోతున్నాడు. ఒక్క ఘడియలో అతడు హిమాలయపర్వతాల దగ్గర ఒక కుటీరం ముందు ఆగాడు.

"ఓహో! ఈ కుటీరంనుంచే ఈపంది వజ్రాన్ని దొంగిలించి ఉంటుంది. లోపలికి వెళ్ళి ఇంకా ఎన్ని వజ్రాలున్నాయో చూద్దామని అడుగులు మెల్లగావేస్తూ కిటికీచేరి తొంగి చూశాడు.

అందులో ఎవరో తపోనిష్ఠలో ఉన్నట్లు కనిపించింది. చలితో చేతులు కొంకర్లు పోతున్న ఈ ప్రదేశంలో ఆ కుటీరంలో వెచ్చ

# ★ తీయమామిడి చెట్టు ★

దనాన్నిచ్చే వేడి ఉంది. ధనంజయుడు తలుపు తట్టాడు.

"ఎవరు వారు?" అని లోపల తపస్సుచేసే భంగిమలో ఉన్నాయన పలకరించాడు.

"ధనంజయు డంటారు నన్ను" అన్నాడు ఇవతల నుంచి.

తలుపులు తెరుచుకున్నాయి.

"మీ రెవరు?" అని ప్రశ్నించాడు ధనంజయుడు ఆమునిని.

"నా పేరు పరమానందుడు."

"మునివర్యా నమస్కారం. చలిని జయించిన సత్పురుషా నమస్కారాలు. మీమహిమ...?"

"ఇదిగో...గొడ్డలి...పరశురాముని ఆయుధం...ఒక్కత్రుటిలో నీకు కూడా చలిమంటలు వేస్తుంది చూడు" అంటూ పరమానందుడు గొడ్డలిని తీశాడు. అది గాలిలో ఎగిరివెళ్ళి నురుక్షణంలో క్రలను తెచ్చి మంటలతో నున్న నెగడిని ధనంజయుడి ముందు ఉంచింది.

"ఆహా! స్వామీ! నేనీరాత్రి ఇక్కడ గడపవచ్చునా?" అని ప్రశ్నించాడు ధనంజయుడు.

"నిక్షేపంగా!" అన్నాడు పరమానందుడు.

"మీది ఏవూరో, నాచరిత్ర ఏమిటో చెప్పవచ్చునా?" అని అడిగాడు ధనంజయుడు.

"మాకు అవన్నీ అనవసరం. సర్వ సంగపరిత్యాగులకు మానవుల చరిత్ర అనవసరం" అన్నాడు పరమానందుడు.

ధనంజయుడు కిమ్మనకుండా కూర్చుని, వజ్రాన్ని భద్రంగా తలపాగాలో దాచుకున్నాడు. వజ్రానికి తోడు గొడ్డలిని కూడా సంపాదించాలనుకుంటూ విశ్రమించాడు.

అర్ధరాత్రి లేచాడు. పరమానందుడు గాఢనిద్రలో ఉన్నాడు. ధనంజయుడు గొడ్డల్ని చేత్తో పట్టుకుని, "కట్టెల్ని ఎందుకు కొడతావు...ఈ మనిషితల నరుకు" అన్నాడు.

గొడ్డలి రయ్యిమని వెళ్ళి పరమానందుడితల నరికింది! తెల్లారింది. ధనంజయుడు గొడ్డలిని చేత బుచ్చుకుని నడిచాడు. మరొక కుటీరం కనుపించింది. అందులో అతడు మరొక మునీశ్వరుణ్ణి చూశాడు. వీడి మహిమ ఏమిటో చూద్దామని కుటీరం తలుపు తట్టాడు.

"ఎవరది?"

"ధనంజయుడంటారు నన్ను"

"రావచ్చు"

"మహాశయా! నమస్కారాలు. మీదర్శన భాగ్యంతో జన్మ తరించింది."

"కూర్చోండి...ఏం కావాలి మీకు?"

"మీమహిమ లేమిటో తెలుసుకోవాలని వచ్చాను"

"ఐతే చూడండి" అంటూ సదానందుడు మద్దెలను తీసి ఎడంవైపు వాయించాడు. ఏనుగులమంద ఘీంకారాలతో, కుటీరం చేరుకున్నాయి. ధనంజయుడు చూసి బెదిరిపోయాడు. సదానందుడు ఈసారి కుడివైపు వాయించాడు. ఏనుగులన్నీ చెల్లా చెదరై పారిపోయాయి.

"ఆహా! ఎంతటి శక్తి?" అంటూ ధనంజయుడు, తనవద్ద నున్న గొడ్డలిని విసిరాడు. అది ఒక్క విసురులో సదానందుణ్ణీ, అతని తలనూ దూరం చేసింది.

"జై మహావరాహా!" అంటూ ధనంజయుడు వజ్రాన్నిచ్చిన పందిని స్మరిస్తూ, మద్దెల్ని చంకన పెట్టుకుని, గొడ్డల్ని బుజాన వేసుకుని బయలు దేరాడు.

మరికొంత దూరంలోనే అతడికి మరొక కుటీరం కనిపించింది.

తలుపు తట్టాడు.

"ఎవరు?"

''నన్ను ధనంజయుడంటారు...''

''రావచ్చు''

''నమస్కారం మహాత్మా! మీమాహాత్మ్యంఏమిటో తెలుసుకుపోదామని వచ్చాను.''

''కూర్చో'' అంటూ చిదానందుడు వెండిగిన్నెతీసి ధనంజయుడి ముందు బోర్లించాడు. పంచభక్ష్య పరమాన్నం వడ్డించింది. ''ఆహా! ఎంతటి శక్తి సంపన్నులు మీరు'' అని ధనంజయుడు ఆశ్చర్యంతో చిదానందుణ్ణి చేతులెత్తి నమస్కరించాడు.

''ఇది ఆంజనేయప్రసాదమని మా పెద్దన్నగారు చెప్పారు. ఇందులో నామహత్తు ఏమీ లేదు.'' అన్నాడు చిదానందుడు.

ఈమనిషికి ఓ పెద్దన్నగారుంటే ఆయనదగ్గర ఇంకా ఎన్నెన్ని ఇంద్రజాలశక్తు లుంటాయో అని ఆశకలిగి ధనంజయుడు ఇలా ప్రశ్నించాడు:

''ఆ మహాత్ముని నివాసం ఎక్కడ స్వామీ?''

''అదిగో అక్కడ'' అంటూ

చిదానందుడు కుటీరం కప్పువైపు చూశాడు.

ధనంజయుడు కళ్లు విప్పుకుని అటకవంటి దేదైనా ఉందేమోనని కుటీరం పైభాగాన్నంతా పరిశీలిస్తూండగా "అదృశ్యులు మా అన్నగారు" అన్నాడు చిదానందుడు. ఈ మాటలకి ధనంజయుడిలో కొంచెం పిరికితనం తలెత్తింది కాని, తనవద్ద వజ్రం, గొడ్డలి, మద్దెలలు ఉన్నంతవరకూ అపాయం లేదని ధైర్యం తెచ్చుకుని గొడ్డలిని తీసి నిమిరాడు. చిదానందుడు పెద్దల్లో కలుసుకున్నాడు. వెండిగిన్నెతో ధనంజయుడు ముందంజ వేశాడు.

* * *

నాలుగు రకాల వస్తువులు తన వద్ద ఉన్నాయనే ధైర్యం రాగానే ధనంజయుడికి ఊహాలు కోటలు దాటుతూండగా, అతడి మనసులో మెరుపులా ఒక ఆలోచన మెరసింది. కాశీనగరానికి అధిపతినైతే కొదవే ముంటుంది అని. ఐతే, కాశీరాజు అయిన విజయసింహుడి బలగాన్ని ఓడించగలనా అనే అనుమానం తట్టింది. కాస్సేపు ఆలోచించిన మీదట నెందుకు ఓడించలేను అనుకున్నాడు.

"జై వీరవరాహా!" అనుకుంటూ అతడు వరాహ ప్రసాదమైన వజ్రాన్ని గుప్పిట పెట్టుకుని, కళ్లు మూసుకుని "కాశీనగరం" అనుకున్నాడో లేదో కళ్లు తెరిచేటప్పటికి అతనికాళ్లు కాశీనగరవీధిలో నిలబడి ఉన్నాయి!!

కోటవైపు అడుగులు వేశాడు. కోట బురుజులు ఆకాశాన్ని అంటుతున్నట్లున్న వాటిపై కవచధారులై పహరా తిరుగుతున్న సైనిక వీరులను చూడగానే ధనంజయుడు మద్దెల ఎడంవైపు వాయించాడు. అది అతడికి యుద్ధనినాదంలాగే ఉంది కాని, విజయసింహుని సైనికులకు మాత్రం గారడీవాని మద్దెలలా గనుపించింది. కాని, మరుక్షణంలో ఆ సైనికులకు ఏనుగుల మంద ఘీంకారాలతో కోటవైపు పరుగెత్తుకుంటూ వస్తున్న దృశ్యం కనిపించింది. సైనికులు బాకాలు ఊదారు. వీరులు ఉరుకుతూ కోటగోడలపైకి వచ్చారు. ఏనుగులదండు చూశారు. ఒక్క ఏనుగుమీద ధనంజయుడు కనిపించాడు. బాణాలు సంధించారు. ఒక్కసారిగా నూరుబాణాలు ధనంజయుడి వైపు వచ్చాయి. వాటిని ఏనుగులు తమ తొండాలతో ఆపివేశాయి.

ధనంజయు డీసారి గొడ్డలితీసి మంత్రించాడు. గొడ్డలి దాహం తీరినట్లుగా సైనికులతలలు గిలగిల కొట్టుకుంటూ కిందపడ్డాయి. మిగిలిన సైనికులకు భయంవేసి కోటలోకి పరుగెత్తి రాజుగారి నెదటపడి ఎవరో విచిత్రశత్రువు దండయాత్ర సాగిస్తున్నాడని వివరాలన్నీ చెప్పారు.

గజాశ్వపదాతి దళాలతో విజయసింహుడు రణభేరి మ్రోగిస్తూ కోట ప్రాకారంవైపు వచ్చాడు. ధనంజయుడి కీసారి హడలు పుట్టింది. కాని,గుండెధైర్యంతో వెండిగిన్నెను మంత్రించగానే విజయసింహుని సేనలకు, తన ఏనుగుల మందకూ మధ్యగా పాలకాలవ లోతుగా ఏర్పడింది.

విజయసింహుడి గుఱ్ఱాలు, ఏనుగులు పాలకాలవలో బుడుంగున మునిగి, నోటికి రుచిగా ఉన్న పాలను సేవించి మత్తెక్కి అడుగు కదల్చలేక పోతున్నవి.

ధనంజయుడు విజయగర్వంతో గొడ్డలి ప్రయోగించాడు. పరశురామాయుధం విజయసింహుణ్ణి హతమార్చింది.

క్షణంలో కాశీరాజుగా ధనంజయుడు సింహాసనం ఆక్రమించాడు—"జై వీరవరాహా" అని స్మరిస్తూ.

రాజభవనం ఎంతో వసందుగా ఉంది. కళ్లు కుట్టేటట్లుగా గదులు, తివాసీలు, అద్దాలు, అలంకారాలు, చెలికత్తెలు, సేవకులు!!! కోటలో అడుగుపెట్టిన క్షణంనుంచి కొత్త రాజుకి పాత పరిచారికలు, సేవకులు గులాములమంటూ సలాములు చేయటం ప్రారంభించారు. ధనంజయుడికి ఆనందం అంచులు దాటింది. సింహాసనంపై కూర్చుని ఒక్కసారి గొడ్డలిని నిమిరి "నువ్వు తోటలోని ఆ మామిడి చెట్టును తీసుకురా" అన్నాడు. క్షణంలో గొడ్డలి అదృశ్యమై మరుక్షణంలో మామిడిచెట్టుతో అవతరించింది. పూలతోటలో మామిడిచెట్టును నాటాడు ధనంజయుడు. పండ్లు నిండుగా ఉన్నవి. ఒకటి రుచి చూశాడు, మధురాతి మధురంగా ఉంది. "ఆఁ సరే! ఎల్లుండి రాజదర్బారుకు సామంతరాజులందర్నీ పిలిపించు మంత్రీ!" అని తొలిసారిగా రాజముద్రతో ఆజ్ఞాపత్రాన్ని ఉపయోగించాడు. మంత్రి రాజాజ్ఞ శిరసావహించాడు.

ధనంజయుడు మరుసాటి

# ★ తీయమామిడి చెట్టు ★

మామిడిపండ్లను కోసి ఒక్కొక్క సామంతరాజుకి ఒక్కొక్కపండు పంచిపెట్టాలని తలపెట్టాడు. ఇంతలోకే అతనికొక ఆలోచన తట్టింది: "సామంతరాజులంతా తానిచ్చిన పండునుతిని టెంకను పాతిపెడితే... అన్ని తియ్యమామిడిచెట్లే పెరిగితే...తనచెట్టు, తనపండు, తనూ ప్రత్యేకత కోల్పోవలసి వస్తుందే!'' అనుకున్నాడు.

వెంటనే అతనికి మరొక ఆలోచన కలిగింది. "మామిడిపండ్లను ముక్కలుగా కోసి, టెంకలలో క్రమేకు కొట్టి పంచిపెడితే సరి అంటుమామిడి మొక్క పెరగదు'' అనుకున్నాడు.

రాజదర్బారులో అలాగే అందరి సామంత రాజులకూ మామిడి పండ్ల ముక్కలను, పంచిపెట్టాడు. వారంతా తిని, రుచికి తన్మయులయ్యారు. "మా తోటలోనూ ఇలాంటి మొక్క ఉంటే ఎంత బాగుండును!" అనుకుని టెంకల కోసం సమరం సాగించారు. చేతికి అందిన రాజులందరూ టెంకలను పరీక్షచేసి చూశారు. ఏముంది గివలిన టెంక! క్రమేకుతో కదిలిన టెంక! అంతా ముక్కుమీద వేలేసుకొని కొత్తరాజు తెలివికి ఆశ్చర్యపోయారు. అందులో వక్రసేనుడనే సామంతరాజుకి ఒక వింత ఆలోచన కలిగిందంటే ఆశ్చర్యం లేదు. అతని ఆలోచనలు అతని పేరునుబట్టే పుడుతుంటాయి.

"ఇందులో ఏదో మహత్తులేనిదే ఈ రాజు ఇంత పనిచేయడు. అదేదో కనుక్కుంటేనేగాని కునుకు తీయకూడదు" అని అంతరాత్మతో శపథం చేసుకుని దర్బారు సందడి ముగిశాక ఇల్లుచేరుకుని ఇల్లాలిలో మంతనాలు జరిపాడు. ఆమె "మన తోటమాలిని పంపి తియ్యమామిడిని చేదుమామిడిగా చేయిద్దాం" అని బోధించింది. సరే అన్నాడు సంతోషిస్తూ వక్రసేనుడు.

తోటమాలి పెంటయ్య తన రాజాజ్ఞతోను, రాణీగారి ఉపదేశంతోనూ ఊరువిడిచి కాశీనగరం చేరుకుని ధనంజయుడి దర్బారులో అడుగుపెట్టాడు.

"ఏం కావాలి నీకు?" అని ధనంజయుడు అడిగాడు.

"మహారాజా! నాది కాశ్మీరదేశం. రకరకాల పుష్ప ఫలవృక్షములను పెంచగల దిట్టను. మీ సేవ చేయుటకై ఏతెంచితిని. నను కరుణించి నాకు ఉద్యోగము ఇప్పించు"డని రాజుతో పెంటడు విన్నవించుకున్నాడు.

"అటులనే కానిమ్ము, నేటినుండి మా కొలువులో చేరుము" అని రాజగారు పెంటడిపై కరుణ కురిపించారు.

పెంటడు తోటలో చేరి తీపి మామిడిచెట్టునే ఆశ్రయించుకుని పనిచేస్తూండగా ధనంజయుడు వచ్చి "ఇక్కడికి వారాని కొకసారివచ్చే అలవాటుంది నాకు. ఇకనుంచి పదిహేనురోజుల కొకసారి వస్తూంటాను. మంచికాయ రుచిచూసి వెడుతూంటాను కనుక జాగ్రత్తగా పనిచేస్తూండు." అన్నాడు.


పెంటడు చాల సంతోషించాడు. పక్షంరోజులు ప్రభువు ఈ వైపుకు రానందుకు మహానందం పొంది తన కార్యక్రమంలో నిమగ్నుడయాడు. కృషి ఫలించింది. తెల్లవారితే రాజు వచ్చే గడువు... ఈ రాత్రే పెంటడు ఉడాయించాడు.

ధనంజయుడు వచ్చి మామిడిపండు కోసి నోటపెట్టాడు. ఏముంది!




వాజీకర
(అమూల్య కాయకల్ప)
ఆరోగ్యమే మహాభాగ్యం. బలమే ప్రాణము— వాజీకర యీ రెంటినీ యిస్తుంది. నమ్రతగనంత శ్రమముగా బలహీనం, చూపుమాంద్యము, బుద్ధిమాంద్యం, వగైరా జబ్బులను పూర్తిగా పోగొట్టుటకు అన్ని రకముల నివారణములకు, సాధారణ నరముల బలహీనతకు అద్భుతంగా గుణము నిచ్చుటవలన దీనికిసాటిమరొకటిలేదు.
మలబార్ ఆయుర్వేదిక్ స్టోర్సు
107-108, బ్రాడ్వే మద్రాసు-1
ఫోన్ - 4116
సంప్రదించవలసిన వైద్యులు: Dr. ఎస్. శంకున్ని మేనన్ L. I. M

## వియో క్యూబిజం?



కొంగ



గబ్బిలం

చిత్రకారుడు:
కె. భాస్కరరావు—గుంటూరు.

... చేదు. అతిమధురం అతి విషంగా మారింది. ఎంతపని జరిగింది అని చెట్టుచెట్టూ పరికించాడు. చెట్టు మొదలునుండి చిట్టచివర వరకూ కాకరపాదు పెనవేసుకుపోయింది. ఒకటా ... వందపాదులు! మామిడిపాద అడుగుకి ఆరుపాదుల చొప్పున...కాకరపాదులు తలెత్తి, మామిడిచెట్టును కప్పివేశాయి.

వెంటడిపై ధనంజయుడికి పట్టరాని కోపం వచ్చింది. వాణ్ణి నరికి [illegible]ని నిశ్చయించుకొని, గబగబా తన గదికివచ్చి గొడ్డలిని నిమిరాడు.

గొడ్డలి కదలలేదు !! అదిలించాడు గొడ్డలిని! ఊహుఁ...శక్తి ఉడిగిపోయింది! మద్దెల వాయించాడు మహాకోపంతో మహారాజు!

ఏనుగు కాదుకదా ఈగలదండు కూడా రాలేదు!

వీటి శక్తులన్నీ పోయాయా అని హుంకరిస్తూ రాజు వెండిగిన్నె తీశాడు. బోర్లించాడు...భూమి బద్దలుకొట్టినా వెండిగిన్నెనుంచి మట్టిగాని మరోటి రాలేదు !!

“వీరభద్రా! రక్షించు” అనుకుంటూ పడకగదిలోకి వెళ్ళి వజ్రం తీశాడు. దానికి పూర్వజన్మ సంప్రాప్తించింది...బొగ్గై కూర్చుంది !!

“ఈమంత్రశక్తు లెందు కిప్పుడు. కాశీనగర రాజునైన నాకు ఒక్క తలకాయ...వెంటడి తలకాయ... తీయటం గొప్పా!” అనుకుంటూ దర్బారులోకివచ్చి సింహాసనంమీద కూర్చుని పహారాకోసం గంట కొట్టాడు.

వచ్చారు నలుగురు !!!

వారు సైనికులు కాదు...

ముందు వరాహం! వెనుక ఆనందుడు, అతని సోదరులూ ప్రత్యక్షమయారు !!

“దొంగ రాజా! నీ సైన్యం పచ్చడి అయింది...పోయి చూసుకొందువుగాని సింహాసనం ఖాళీ చెయ్యి” అన్నాడు చిదానందుడు.

వాళ్ళందర్నీ చూడగానే ధనంజయుడి ప్రాణాలు పంజరంలోని పిట్టలా గిలగిలా కొట్టుకున్నాయి. సింహాసనం దిగి ముందుకు నడిచాడు. వెంటనే ఇద్దరు సేవకులు పట్టి ... రాజుని) బంధించారు.

“... వరాహానికి చేసిన కీడు, మా తమ్ముళ్ళకు చేసిన హాని నా దివ్యదృష్టితో తెలుసుకుని వారిని బ్రతికించి వచ్చాను. భయపడకు... నీ మామిడిచెట్టే నీకు శరణు...ఈ రోజునుంచి నువ్వు తోటమాలివి. కాకరపాదు లన్నింటినీ తవ్వి లాగివేసి రోజుకొక కుండెడు చొప్పున మామిడిచెట్టుచుట్టూ పాలు, పెరుగు, తేనె పోయించు... మామూలు మామిడి కాతుంది. పళ్ళు...నీ కదే శిక్ష,” అన్నాడు ఆనందుడు.

వెంటనే దర్బారుతీర్చి “మేము రాజ్యాన్ని పాలించటానికి రాలేదు. అసమర్థుడు, అతిదుర్మార్గుడూ అయిన ఈ ధనంజయుణ్ణే మీ రాజుగా తప్పించి, మీ రాజ్యం మీ ప్రజలచేతుల్లో పెట్టటానికే వచ్చాం. మాతృదేశ భక్తే మమ్మల్ని విధంగా చేయించింది. మీ తోటలోని మామిడికి పూర్వపు రుచి త్వరలోనే వస్తుంది. దేశంలోఉన్న ప్రజలందరికీ ఆ మామిడిపండ్లను తినే హక్కు ఉంది. మీరంతా భుజించి మీ ఇంట్లోనే మొక్కలు నాటి చెట్లను పెంచుకోండి. మేము ఏడాది కొకసారి వచ్చి గంగాస్నానమాచరించి, దేశంచూసి వెళ్ళిపోతూంటాం.” అని ఆనందుడు ప్రజలకు, సామంతరాజులకు ఉపన్యసించాడు.

నాడు ఇంటింటా నాటిన తియ్యమామిడిచెట్లే నేడుకూడా దేశమంతటా వెలిసింది. అదే తీపి మామిడి !! ★